పెండ్లి ముచ్చట్లు

శ్రీమతి పి. రాజేశ్వరమ్మ

ఏమండీ! పెద్ద పిల్లకు పెండ్లి ప్రయత్నంచేయరా ఏమిటి, ఎన్ని పర్యాయములు చెప్పినా, చూస్తూ వ్నాను! చూస్తున్నాను అనడమేకాని శ్రద్ధవహించి నట్లు ఏమీకనబడదు. ఏమిటండీ మీవూహ అంది? మీనాక్షమ్మగారు.

సోమసుందరంగారు, చూడు, మీనాక్షీ, ఏమిటీ తొందర! పిల్లలు యింకా చదువుకుంటున్నారుకదా, ఆ పైన వాళ్ళకు ఏమంత వయస్సు వచ్చిందని నీవూహ యింతకి శ్యామలని కనుక్కొన్నావా ఏమంటుందో ఏమిటో అని నవ్వుతూ సమాధానంచెప్పేడు.

చాల్లెద్దురూ పిల్లనాకువివాహంచేస్తారా చెయ్యరా అని అడుగుతుందా ఏమిటి. ఏమో మేమెరుగం ఐతే పిల్ల నాకు పెండ్లి చెయ్యండీ అని అడిగేదాకా చెయ్యరన్నమాట! యిదేనా మీసంకల్పం! అని విసుగ్గా వెళ్ళిపోయింది.

సోమసుందరంగారిది రాజమహేంద్రవరము. ఆయనకు మంచి భూవసతివుంది. బి. ఏ. డిగ్రీపొందినా, ఆస్తివుండడము చేత ఉద్యోగమునందు ఆసక్తి చూపలేదు. ఉన్న ఊరునందే స్వంతభవంతియందు వుంటూ పొలము చూసుకుంటూ, అప్పుడప్పుడు పత్రి కలకు వ్యాసములు వ్రాస్తూ సిరిసంపదలతో, పాడి పంటలతో, యింటినిండా నౌకర్లు మొదలగు పరివార ములతో నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా జీవ యాత్ర సాగిస్తున్నాడు.

ఆయనకు లలితా శ్యామలా అనేయిరువురు కుమా ర్తెలు. వారిరువురు విద్యాబుద్ధులతోనేకాక, సంగీ తము, నృత్యము కుట్టుపని మొదలగు లలితకళలలో కూడా ప్రవీణులయ్యారు. వారికికల విద్యా సంపత్తి వారి అపురూప సౌందర్యానికి తోడై, బంగారమునకు పరిమళ మబ్బినట్లురాణింపజేస్తోంది.

ఒకనాడు, సోమసుందరంగారు డ్రాయింగు రూములో కూర్చుని పేపరుచదువుతూ "అమ్మా, శ్యామలా" అనిపిలిచాడు. తండ్రి పిలుపువిన్న శ్యామల 'ఏమండీ నాన్నగారూ పిలిచేరెందుకండీ' అని అడిగింది. "అబ్బే, ఏమీలేదమ్మా ఏమిచేస్తు న్నావో అని పిలిచేను. బాగాచదువుకుంటున్నారా, తల్లీ చెల్లీనువ్వూనూ—అవునుగాని, అమ్మా! నీవివాహ విషయంలో మీ అమ్మ చాలా ఆలజడిచేస్తోంది. నీ ఉద్దేశం ఏమిటో కొంచెం చెప్పు తల్లీ" అని అన్నాడు. శ్యామల చాల సిగ్గుతో "నాకేమీ తెలి యదండీ నాన్నగారు" అని వెళ్లిపోయింది. ఈ మాటలు ప్రక్కను నక్కివింటూన్న లలిత మాత్రం పరుగుపరుగునవచ్చి, తండ్రి ఒడిలో వ్రాలి "ఏమి టండీ నాన్నగారూ. అక్కకి పెళ్లా? ఎప్పుడండీ? బావగారెవరండీ? వారిది ఏవూరండీ?" అని ప్రశ్నల వర్షంకురిపించింది. అంతట సోమసుందరంగారు "ఏమిటే వెర్రి తల్లీ యీహడావిడి. ఇదంతాచూస్తే అక్కకన్నా నీకేముందు పెళ్ళిచెయ్యాలేమో అని పిస్తోంది" అని కూతుర్ని బుజ్జగిస్తూ సమాధానం చెప్పేడు.

ఇలా సంభాషణ జరుగుతూవుండగా, "వీధిలో సంగీతం మేష్టారు వచ్చి కనిపెట్టుకుకూర్చున్నారని" నౌఖరు వచ్చి చెప్పడంచేత, శ్యామలా లలిత లిద్దరూ సంగీతం నేర్చుకుందుకు వెళ్ళేరు.

కొన్ని రోజులుగడిచాయి. ఒక రోజు సోమ సుందరంగారు పెళ్లాన్ని పిలచి "మీనాక్షీ! పిల్లని పెళ్ళివిషయమై కదిపితే తనకేమీ తెలియదంది. పోనీ నీవేనాకనుక్కొంటే ఏమంటుందో తెలుసుకో వచ్చుగదా!" అన్నాడు. ఆమె మాత్రం యథాప్రకా రంగా "ఏమిటండీ విచిత్రపుమాటలు మీరూను. మనకి నచ్చిన సంబంధం ఏదో అన్నివిధాలాబాగున్నది

చూసి చెయ్యాలికాని పిల్లనడిగితే దానికేమి తెలుస్తుందండీ! చిన్న పిల్ల" అంది.

"అదికాదే నా ఊహ. పిల్ల యిప్పుడు ఫిఫ్తుఫారం చదువుతోంది కదా స్కూలుఫైనలైనా పూర్తి కాకుండా వివాహవిషయం తలపెడితే ఒప్పుకుంటుందో, ఒప్పుకోదో అని, అంతేకాని నాకుమాత్రం పెండ్లి చెయ్యాలనిలేదా ఏమిటి ?"

"అప్పుడే సంబంధంకుదిరి సిద్ధంగా ఉన్నట్లు మాట్లాడతారేమిటండీ! తగిన సంబంధం కుదరాలంటే ఎంత విశ్వప్రయత్నం చెయ్యాలండీ – యిప్పట్నించీ ప్రయత్నాలు చేస్తే, మీకోర్కెప్రకారం పిల్ల స్కూలు ఫైనల్ పూర్తిచేసే సరికైనా సంబంధం స్థిరపడుతుంది" అని సమాధానంచెబుతున్న సమయంలో, లోపలినుంచి, "మీనాక్షీ! మీనాక్షీ!" అని కేక వినబడ్డంచేత అత్తగారు పిలుస్తున్నారని చెప్పి ఆమెలోపలకు వెళ్ళింది."

భార్య చెప్పిన సలహాప్రకారం పిల్లకు సంబంధాలు వెతకాలని నిశ్చయించుకొని సోమసుందరంగారు మర్నాడు తమ పురోహితులైన వేరయ్యశాస్త్రి గారకే కబురుచేశారు. కబురు అందగానే ఆయన వారింటికి వచ్చాడు.

"ఓహో శాస్త్రిగారా దయచెయ్యండి" అని, ఆయనను ఆహ్వానించి సుఖాసీనుల్ని జేశాడు.

ఈ విధంగా భర్త, పిల్ల పెండ్లి విషయమై శ్రద్ధ చూపుతున్నందుకు ఆనందభరితురాలై, తానుకూడా శాస్త్రిగారి రాకకు కనిపెట్టుకుని అంతకు ముందునుంచీ అక్కడేవుంది.

శాస్త్రిగారు రాగానే పెద్దది అన్ని విధాలా అనుభవంకలది అని తన తల్లిగారినికూడా రమ్మని కేక వేశాడు, జరిగేసంభాషణలలో పాల్గొనేందుకు.

ఆమెకూడా లోపల్నించి వచ్చి అక్కడే కూర్చుంది.

ఈ అలజడంతా చూస్తున్న శాస్త్రిగారు మాత్రం తన్ను పిలిపించిన పని ఎందుకైవుంటుందో యిట్టే గ్రహించి, ఎరుగున్న సంబంధాలనన్నింటినీ బుర్రలో తిరుగవేయడం మొదలెట్టినట్లు కూర్చున్నాడు.

తల్లీ వచ్చి కూర్చోగానే "శాస్త్రిగారూ మా పెద్ద పిల్లకు పెళ్ళి చెయ్యాలనే ఆలోచన కొంతకాలం నుంచీ మాకు గట్టిగాపట్టుకొందండీ. నా సంకల్పం పిల్ల స్కూలుఫైనల్ పూర్తిచేసిన తర్వాత చెయ్యాలని; మా ఆవిడ సంకల్పంకూడా అదే అయినప్పటికీ ఇప్పటినుంచీ వెతికితేకాని తగినసంబంధం అప్పటికి రావద్దా అని ఈ విషయంలో మీ సలహాకూడా తీసుకోవాలని మా అభిలాష. అందుకే మీకిప్పుడింత శ్రమకల్గించింది." అన్నాడు.

"శ్రమేముందండీ, అందులో వివాహంవంటి శుభ కార్యాల్లో చేయకలిగిన సహాయం చెయ్యడం అంటే నాకెంతో సంతోషము. తమరు కబురుచేసినప్పుడే విషయం ఏమైవుంటుందా అని అనుకొన్నాను. తీరా యిక్కడికి వచ్చి మిమ్మల్ని చూడగానే, పెద్దపిల్ల పెళ్ళి విషయమై ఉంటుందని అనుకొన్నాను. అమ్మగారు వచ్చేలోగా అందుకే తమ తాహతుకు తగిన ఎరుగున్న సంబంధాలు ఏమైనావున్నాయా అని ఆలోచించడం మొదలు పెట్టాను."

అసలే ఆదుర్దాగావున్న మీనాక్షమ్మగారు అందుకొని "శాస్త్రుల్లుగారూ! రాత్రింబగళ్ళు మాకు పిల్ల పెళ్ళివిషయమై ఆలోచన పట్టుకుందండీ. ఏదో ఇంత తెలివితేటలు మంచిచదువూ తినడానికి యింత వసతివున్న సంబంధంమేదైనా మీ దృష్టిలోవుంటే చెప్పదురూ!"

సోమసుందరంగారు కూడా అందుకొని "శాస్త్రి గారికి తెలియదా ఏమిటి పిల్లవాడు బుద్ధిమంతుడై యింతస్థితి అది వున్నవాడై వుండాలని మా అమ్మ అంటుంది.

"పిల్లవాడు మంచిరూపవంతుడై, బుద్ధివంతుడై మంచిస్థితికలవాడై, దానికితోడు చదువుకున్నవాడై వుండాలని మా ఆవిడ కోరుతుంది."

"పిల్లవాడురూపవంతుడై, బుద్ధిమంతుడై స్థితి వున్నా లేకపోయినా బి. ఏ. వరకైనా చదువుకున్నవాడై వుండాలని నా కోరిక. మా కోరిక లిలా వున్నాయండీ శాస్త్రిగారూ."

ఇకనే సర్వమూ యిప్పుడు విశదమైంది. స్థితి రూపమూ, విద్యా, గుణమూ, సామర్థ్యము ఉన్న కుర్రవాడు కావాలంటారు. కోరికలవుతే బాగా వున్నాయి కానీ యీ లక్షణాలన్నీ కలిగిన కుర్రవాడు ఒహూపట్టాన దొరుకుతాడంటారా? ఒకవేళ దొరికినా కట్నకానుకలు విషయంలో వాళ్ల దాహం తీర్చటానికి వీలౌతుందా! ఐనా తమ విషయంలో ఏమాత్రమూ అప్రమత్తత చూపకుండా తగినప్రయత్నాలు చేస్తాను. లోకమంతా గాలించి వలసివచ్చినా గాలించి తీరుతాను."

మీనాక్షమ్మగారు "ఈ భారమంతా మీమీదే ఉంది శాస్త్రిగారూ! కట్నంకానుకల విషయంలో ఎంతవరకూ భరించడానికి వీలౌతుందో అంతవరకూ భరించుదాం. చూస్తూ, చూస్తూ, లక్షణమైన పిల్లను తీసుకొనివెళ్ళి కానిచోట పడవెయ్యగలమా చెప్పండీ అది సుఖపడవద్దూ!"

"ఔనమ్మా ఔను పిల్లను నేనెరుగనా ఎంత రూపవతి ఎంత విద్యావతి ఎంతబుద్ధిమంతురాలు! నేచెప్పేనుకాదమ్మా నాశాయిశక్తులా ప్రయత్నించి తగినసంబంధాన్నే తీసుకువచ్చి మీకునచ్చుబాటయేటట్లు చేస్తాను, సరే_ఈ విషయంలో మీరేమీ అధైర్యపడవద్దు"

సోమసుందరంగారు "ఔను శాస్త్రిగారూ, మీరంతటివారనే ఈ విషయాన్ని మీకు అప్పగించాము. మా మేనల్లుడు మోహన్ కూడా దృష్టిలో ఉన్నాడు. కాని పిల్లవాడికంటే ముందు మా బావగారితో వేగడం బహు కష్టమండీ. అతనిది మళ్ళీలో, ముళ్ళు వేసే స్వభావం మనమెంతచేసినా రాణింపుకురాదు" అన్నాడు.

అప్పుడు సోమసుందరంగారి తల్లి మాత్రం, ఏమిట్రా నాయనా, నీకు పట్టుదలేకాని, లేనిపోని కారణాలు చెప్పి నిక్షేపంలాంటి సంబంధం వదులుకుంటావుట్రా, కుర్రాడేదో పెద్ద చదువేటగా చదువుచున్నాడు! కలిసిన సంబంధం మన కమల సంతోషిస్తుంది. వెర్రి పిల్ల పదిసార్లు ఇక్కడికి వొచ్చినప్పుడల్లా మా పిల్లవాడికి పెళ్ళాంతయారవుతోందని అనేది. పిల్లవాడికి కూడా ఇష్టమేటగా! నీ బావమాత్రం పట్టుబడితే ఒప్పుకోడా ఏమిటి-నీ వెర్రికానీ."

శాస్త్రిగారుకూడా వెంటనే "అవునండీ, యింకా సందేహిస్తారెందుకండీ! కొండ తలక్రిందపెట్టుకొని రాళ్ళకొరకు వెతికినట్లుఉంది. ఈ సంగతి నేనే ఎత్తుదామని యిందాకనే అనుకొన్నాను. కాని మీరేకారణంవల్ల తల పెట్టడంలేదా అని ఊరుకొన్నాను. మీరు ఊ అంటే ఇప్పుడే నేను వెళ్ళి తథాస్తని చక్కా వచ్చేస్తాను; ఏమంటారు?"

దానిపై సోమసుందరంగారు "మా బావతో వేగలేమండీ, మా చెల్లెలు పెళ్ళయిన నాటినుంచీ అతన్ని నేనెరుగనాండీ! అతను సామాన్యుడుకాడు. నేనంటే ఎందుకో అతనికి గర్భవిరోధము. ఆ సంబంధం చేసుకొని మనం నిగ్రహించలేము. కనుక మీ ఎరిక సంబంధం ఏదేనావున్న చూద్దురూ, శాస్త్రిగారూ"

చివరికి పైసంబంధాన్ని చూడ్డానికే నిశ్చయించుకొన్నారు. మరో పర్యాయం చెప్పడంవల్ల శాస్త్రిగారు తగిన సంబంధం చూస్తానని నడుంకట్టాడు. భోజనాలకి వేళవడంవల్ల శాస్త్రిగారినికూడా మడిగట్టుకొమ్మని సోమసుందరంగారు బలవంతపెట్టారు. కాని ఆయన పనులు చూసుకొనవలసినవి కొన్ని వున్నాయని చెప్పడంచేత ఆయనను సాగనంపి అంతా భోజనాలకు లేచారు. భోజనాల దగ్గరకూడా సంబంధాల విషయమై తిరిగి మరొకమారు సంప్రదించుకొన్నారు. "నా వెర్రి తల్లికి ఎటువంటి మొగుడు వస్తాడో" అని మాటల మధ్య తల్లి పది

సార్లు అనుకొన్నది. శ్యామల వాళ్ళు చెప్పుకొనే మాటలు తలవంచుకొని వింటూ, విననట్లుగా భోజనం చేస్తున్నట్లు నటించింది.

లలితకు మాత్రం “తగిన సంబంధం ఎందుకురాదూ, లేకపోతే బావగార్ని ముప్పతిప్పలూపెట్టి మూడు చెరువులనీళ్లూ—అక్కడాకా ఎందుకు నేనే తాగించే స్తాను.”

స్కూలు ఫైనల్ పరీక్ష రోజులు ఒక మాసం ఉన్నవి. శ్యామలా, లలిత లిరువురూ తమ తమ చదువుల్లో నిమగ్నులయ్యేరు.

కొంతకాలం పిమ్మట ఒకనాడు మధ్యాహ్నం మూడు గంటలూ ఆ ప్రాంతములో సోమసుందరం గారూ, ఆయన భార్య, తల్లీ, నడవలో కుర్చీలలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూన్నారు. యింతట్లోకే శాస్త్రిగారుకూడా అక్కడికి వచ్చారు. శాస్త్రి గారిని చూడగానే అంతా సంతోషంతో ఆయనను సత్కరించి, కుర్చీపై కూర్చోమన్నారు. కుశల ప్రశ్నాదికము అయిన పిదప, శాస్త్రిగారు తామంత వరకూ చేసిన వివాహక విషయమైన ప్రయత్నాలను గురించి మొదలు పెట్టారు.

“ఆ నాడు మీతో చెప్పింది మొదలుకొని నేటి వరకూ మీ అమ్మాయి వివాహ విషయంలో నేను చెయ్యని ప్రయత్నం లేదంటే నమ్మండీ, తిన్నచోట పడుకోకుండా, పడుకున్నచోట తినకుండా, ఎక్కడక్కడ ఊళ్ళకూ దూరభారమనకుండావెళ్ళి ఎరుగున్నవాళ్ళను అందరిని విచారించడమేకాకుండా కళాశాలలూ, లైబ్రరీలు, క్లబ్బులూ మొదలగు వాటికికూడావెళ్ళి మనదేశంలోగల పెళ్ళికొడుకుల నందరినీ విడవకుండా చూసివచ్చానండీ, మనకి అన్ని విధములా సరిపడిన సంబంధాలు కొన్ని తెలుసుకొని వచ్చాను. కాని అన్నింటికంటే ముఖ్యమైన సంబంధం ఒకటి నెల్లూరులో తటస్థమైంది.

పిల్లవానిపేరు గోపాలరావు. బి. ఏ. చదువుతున్నాడు. ఎర్రగా తోగడు ధారంలా, కనుముక్కు తీరువుగావుండి చాలా లక్షణంగా వుంటాడు. ఈ కుర్రాడు చేబ్రోలు నరసింహం గారనే ఆయనకు రెండవ పిల్లవాడు. ఆయన జిల్లా కోర్టు ప్లీడరు. నెలకు రు. 1500, 1000కు తక్కువ కాని రాబడి. స్వార్జితంవల్లనే మంచి ఆస్తిపాస్తులు గడించేడు. ఆయనకు ముగ్గురు కుమారులు. ఈ పిల్లవాడు రెండో పిల్లవాడు. అన్నింటిలోకి యీ సంబంధమే మనకు బహు యోగ్యంగా ఉండేటట్లు కనబడుతోంది.”

“ఆ వెంటనే మీ సాక్షమ్మగారు ఈ సంబంధంచేస్తే పిల్ల చాలా అదృష్టవంతురాలయ్యేటట్లు కనబడుతోందండీ.”

శాస్త్రిగారు చెప్పిన మాటల తీరునబట్టి సోమసుందరంగారుకూడా అంతకంటే వేరే ఏమీఅనలేక పోయి, యింత చక్కటి సంబంధం సులభంగా లభ్యమౌతుందా అన్న సందేహంతో “కట్నకానుకల విషయం చెప్పేరుకాదు?”

“ఇదిగో వస్తున్నా కట్నకానుకలు హెచ్చుగా వున్నట్లు కనబడినా ఆ సంబంధాన్నిబట్టిచూస్తే తక్కువగా వున్నాయనే చెప్పాలి. ఏమంటారా ఆస్తి పాస్తులువల్ల ముగ్గురు కొడుకులకూ కలపి రు. 6000 వస్తాయట. తండ్రి యింకా మంచి గడింపులోనే వున్నాడు. పిల్లవాడు చదువుకుంటున్నాడు. యింతకీ వారు అడిగినది రు. 5500/-యితర లాంఛనాలక్రింద 500/- మొత్తము రు. 6000/-అనుకోండి.”

సోమసుందరంగారూ, ఆయన భార్య కలసి యీమాత్రం యివ్వందే యీ రోజుల్లో వరుడు దొరకడం కష్టమని తలంచి, బాగానే వుందన్నారు.

ఆయన తల్లిమాత్రం కమల కొడుకు సంబంధం మాత్రం దీనికి తీసిపోయిందా ఏమిటి అని అనకుండా వుండలేకపోయింది.

చివరికి శాస్త్రిగారు తెచ్చిన సంబంధమే నిశ్చయించారు.” త్వరలోనే ముహూర్తం ఏర్పాటు

చేయించండీ శాస్త్రిగారూ! పిల్లలకీ పరీక్షలయిపోయినవి. యింక ఏవిధమైన అడ్డంకులూకూడాలేవు.”

“ఓ దానికేమి యీ మధ్యవారం, పదిరోజులలో ఒక ముహూర్తంవున్నట్లు జ్ఞాపకం ఏదీ పంచాంగం ఓసారి యివ్వండి—యిక్కడే ముహూర్తం నిశ్చయం చేసి వెళ్తాను” అని అక్కడే ముహూర్తం నిర్ణయించి స్థిరపరుస్తాడు శాస్త్రిగారు.

ఈ ముహూర్త నిర్ణయం మగపెళ్ళివారికికూడా తెలియజేసి వారి సమ్మతికూడా తీసుకున్నారు.

పెండ్లి ముహూర్తం చాలా తొందరలో కుదరడంచేత పెళ్ళికి అందరూ పనులుచేసేవారే.

వివాహము ఎల్లుండి అనగా అందరూ పెండ్లికూతుర్ని చేసే నిమిత్తం పిలుపులకు బయలుదేరారు.

శ్యామల మేనత్త కమలకూడా ఆ రోజు సాయంత్రం బండికి, అన్నగారి కుమార్తె వివాహం మాడడం నిమిత్తమై చంటిపిల్లని తీసుకుని వచ్చింది.

ప్రొద్దున్నే శ్యామలని పెండ్లికుమార్తెను చేసే నిమిత్తం తలంటి స్నానంచేయించి మంచిరకమైన మైసూరుశిల్కుచీర కట్టారు. ఆ మధ్యాహ్నం పేరంటాళ్లందరూ వచ్చారు. ఆ వేడుక చాలా ఆనందముగా జరిగింది.

ఆ రాత్రి బండికే పెళ్ళివారేవత్తుమంది నెల్లూరు నుంచి బయలుదేరి రాజమండ్రీ చేరుకున్నారు. పెండ్లివారికి తగు మర్యాదలతో ఎదురు సన్నాహం జరిపి విడిదిలో ప్రవేశపెట్టారు. రాత్రి భోజనాలుచేసి ఎవరిపక్కలువారు పరచుకొని నిద్రపోయేరు.

శ్యామల మేనత్తకొడుకు మోహన్ బి.ఏ. బి.ఎల్. మెద్రాసులో చదువుతూ శెలవు లివ్వడం వల్ల శ్యామల పెండ్లికి నేవెళ్లకపోవడమా! అని, పువ్వుల బుట్టలతో ఆ రాత్రి జనతాకు పెండ్లివారింటికి పెండ్లి చూచే నిమిత్తం వచ్చాడు. అతన్ని చూచేసరికి అందరికి ఆనందమయి ముచ్చటగా సంభాషణలు జరిపికొని ఆనందముగా కాలంగడిపేశారు.

తెల్లవారేసరికి మగపెళ్ళివారి విడిదిలో స్నాతకం హడావిడి. ఆడపెళ్ళివారింట్లో కాఫీ, ఉప్మాల హడావిడి, రాత్రి జరగబోయే వివాహసరం జామాను గురించి హడావిడితో నిండిపోయింది.

స్నాతకం ముందు మగపెళ్ళివారి విడిదికి కాఫీ ఉప్మాలనిచ్చే నిమిత్తం, లలిత, తల్లీ మొదలగువారు వెళ్లేరు. పెండ్లికొడుకుని చూచింది. లలిత, ఆమెకు నచ్చలేదుకాబోలు వెంటనే యింటికి వచ్చేసింది. “అక్కా! అక్కా! యీసంబంధంనాన్నగారు మాడలేదా ఏమిటే అతను పెద్దవాడిలా వున్నాడు. మనిషి మాస్తే చాలా వికారికూడాను, చదువుకున్నవాడిలా కనబడలేదే అక్కా; ఎదో బి. ఏ. గోపాల్, పి. ఏ.లా వున్నాడేయీ గోపాలంగారు!” అని నిరసనగా హేళనచేసింది.

యీ హేళన విన్నప్పటినుంచీ శ్యామలకి మనస్సు, మనస్సులోలేదు ఏమిటీ, యింత అన్యాయముంటుందా అని అనేక విధములైన భావములతో ఆనందమంతయు నీరై పోయింది.

తెల్లవారిన తర్వాత సుందరంగారు, యీ వరుణ్ణి, పెళ్ళివారిని చూచినప్పటినుంచీ ఆయన మనస్సు, మనస్సులోలేక, ఖిన్నుడై, శాస్త్రిచేసినదంతయు మాయ అనుకొని యిది ఒదిలేపరిస్థితి ఎలాగా అని ఆలోచిస్తున్నాడు.

యిలా వుండగా, శ్యామల దగ్గరకి, మోహన్, ఒక మంచి విలువైన వింతవస్తు ఒకటి తీసుకొనివెళ్లి “పెండ్లికుమార్తెగారికి బహుమతిగా తెచ్చానండీయీ కానుక స్వీకరించకోరుతున్నాను” అన్నాడు.

శ్యామలకి, మోహన్ని చూచేటప్పటికి విపరీతమైన దుఃఖం వచ్చింది. “ఏమిపెండ్లి బావా, యిదంతయు చాలా మాయగావుంది. యీ వివాహము నాకిష్టములేదు” అని చెప్పేసింది.

యీ కబురువిన్న మోహన్కు ఏమీఅర్థమవలేదు. “ఏమిటి శ్యామలా నీ కిష్టంలేకనే మామయ్య యీ

సంబంధం నీకు స్థిరపరచాడా" అని జరిగిన సంగతులు తెలుసుకునే నిమిత్తం, మేనమామ దగ్గరకు వెళ్లేడు.

సుందరంగారు జరిగిన మోసం అంతా మేనల్లుడితో చెప్పేడు. మోహన్ యీ జరిగిన సంగతులకు ఆశ్చర్య పడి ఎవరా పెండ్లివారు అని, వాళ్లను చూచే నిమిత్తం విడిదికి వెళ్ళేడు.

అక్కడ తనతో మద్రాసులో చదువుకునే స్నేహితుడు ఒకడు కనుపించాడు. వారిరువురూ ఒకరి నొకరు తమ రాకల విషయమై సంభాషణలు జరుపుకొనిరి. ఆ స్నేహితునికి పెండ్లికుమార్తె ఎక్కడో దూరపుబంధువనియు, తన గ్రామం చేరుకునేందుకు వెళ్లుతుండగా మధ్యనదిగి యీ వేడుకచూచి వెళ్లుదామని వచ్చాననియు, ఆ పెళ్ళివారి స్థితిగతులు మొదలగు విషయములన్నియు చెప్పుకొచ్చాడు. మోహన్ యీ సంగతులన్నియు విని, మేనమామతో పెండ్లివారి యొక్క యావత్తు పరిస్థితులు చెప్పాడు. అక్కడ వున్న పెద్ద మనుష్యులందరూ యీ మోసం తెలుసుకుని, పెండ్లి పెద్దయిన,తండ్రివద్దకు వెళ్ళి, "ఏమయ్యా, యీ మోసం, యీ అన్యాయమూను, కట్నమనే పేరుతో, డబ్బు సంగ్రహించడానికి వేసిన ఎత్తుటయ్యా యిది. చదువుకున్నటువంటి లక్షణమైన పిల్లను అన్యాయముగా బాధిద్దామనుకున్నారా, చాల్లెండి, మీ నెల్లూరు మాయలు, యిక వెళ్లొచ్చు పెళ్ళివారు. ఎప్పుడూ యిటువంటి అన్యాయమునకు సిద్ధపడకండి" అని ఎవరికితోచినమాటలు వాళ్లు విసిరేసి ఆ వచ్చిన పెళ్ళివార్ని తిరుగు దారి పట్టించారు. వారు నెత్తి నోరు మొత్తుకొని వచ్చిన దారినే తిరుగు ప్రయాణంపట్టి వెళ్ళిపోయారు.

యీ గండం గడచినదికదా అని యింటిల్లిపాదీ సంతోషించి ఆ శాస్త్రుల్లుని అనేక విధముల నిందించి, ఎప్పుడూ, ముక్కు మొగమూ ఎరగని సంబంధాలుకు వెళ్లకూడదని విచారించి, అన్ని విధములా పరిచయమున్న సంబంధం, పెద్దయిన, అమ్మ చెప్పినట్లు మోహన్ యే అని నిశ్చయించి ఆ శుభ ముహూర్తమునకు శ్యామలా, మోహనులకు, దేదీప్యమానముగా వివాహము జరిపించిరి. బంధువర్గమంతా ఆ వివాహంలో పాల్గొని, దంపతులను ఆశీర్వదించి ఎవరి స్థానములకు వారు చేరిరి.

నవ దంపతులయిన, శ్యామలా, మోహన్ల ఆనందమునకు మేర లేదు.